# విడాకులు

అది మధ్యాహ్నవేళ. ఎండవేడి ఎక్కువగా వుండటం వల్ల, బజార్లు జనసమ్మర్ధంగా లేవు. వాంగ్ఎర్ యొక్క టీ అంగడి పెద్దబజారుకి రెండువీధులు వెనకవుంది. పొద్దున్నే టీ తాగటానికీ, ఉబుసుపోకకీ, కబుర్లకీ వచ్చిన జనం ఆ అంగటి నుంచి అప్పటికప్పుడే వెళ్ళిపోయారు. ఆ అంగడి యజమానియైన వాంగ్ఎర్ టీ కప్పులు కడిగి, బల్లమీద పేరుస్తున్నాడు. ఇది పూర్తిచేసి నెమ్మదిగా "పైప్" తీశాడు. అప్పుడు బాగా డ్రెస్ చేసుకున్న ఒక పొడుగాటి వ్యక్తి ఆ అంగడి ప్రవేశించాడు. ఆ వ్యక్తి వొత్తుగావున్న కనుబొమ్మలూ, నల్లని లోతుకళ్ళూ, ఆతనికొక విశిష్టతను చేకూర్చి పెట్టినై.

ఈ మనిషిని వాంగ్ఎర్ ఇదివరకెప్పుడూ చూచి వుండలేదు. కాని అతన్నిచూచి ఆశ్చర్యపడనుకూడా లేదు. తన అంగడికి రకరకాల మనుష్యులు వస్తుంటారు. ఈ జీవితానికి రక్తిని కూర్చేదే అది. వ్యాపారస్తులు, వాళ్ళ కుటుంబాలు, పండితులు, విక్రయదారులు, జూదగాళ్ళు, మోసగాళ్ళు, అపరిచయస్తులు అనేకమంది విశ్రాంతిని కోరి వస్తూవుంటారు. యిక ఎవ్వరిని చూచి మాత్రం ఆశ్చర్యం దేనికి? ఈ పొడుగుపాటి కొత్త మనిషి, లోపలి భాగంలోని బల్లదగ్గర కూర్చున్నాడు. అతను కలిసి మెలిసి వుండే స్వభావం గలవాడుగా కనుపించలేదు. పైగా కొస్త ఉద్రేకిగా వున్నాడు.

కాసేపటికి ఒక కుర్రవాడు 'ద్రాక్షకాయలు, జామకాయలు, అరటికాయలు' అని కేకలు పెట్టుకుంటూ బజార్న వెళ్ళటం కనిపించింది. ఆ కొత్తమనిషి ఆకుర్రవాణ్ణి పిలిచాడు ఆ కుర్రవాడు తన సరుకు కొనటానికి పిలిచాడనుకొని, 'మంచికాయలు, ద్రాక్షకాయలు, జామకాయలు, అరటికాయలు' అనుకుంటూ దగ్గరకు వచ్చాడు.

"అవి అక్కడ వుంచు. నీ పేరేమిటి?" అని అడిగాడు ఆ క్రొత్త మనిషి.

"సెంగ్‌ఎర్. అదీ నా పేరు" అన్నాడు కుర్రవాడు.

"మామూలుకంటే యెక్కువ డబ్బు సంపాదించాలనే కోర్కె నీకు వుందా సెంగ్‌ఎర్?" అని అడిగాడు కొత్తమనిషి.

ఈ ప్రశ్నకు సెంగ్‌ఎర్ కళ్ళు మెరిసినై. "ఓ బలేగా వుంది" అన్నాడు.

"అయితే నాకొక పని చేసిపెట్టు" అని ఎదురుగా వున్న యింటిని చూపి, "ఆ యిల్లు ఎవ్వరిదో నీకు తెలుసా?" అని అడిగాడు.

"అది హువాంగ్‌పూగారి ఇల్లు. వారికి రాజప్రసాదంలో ఉద్యోగం దుస్తులమీద అజమాయిషీ" అన్నాడు కుర్రవాడు.

"అట్లనా? ఆ ఇంట్లో యెంతమంది కాపురం వుంటున్నారో నీకేమన్నా తెలుసా?" అని అడిగాడు కొత్తమనిషి.

"ముగ్గురు మాత్రమే" అని చెప్పాడు కుర్రవాడు. "ఆ ఉద్యోగీ, ఆయన భార్యా, ఒక నౌకరిపిల్లా."

"మంచిది. ఆయన భార్యను నువ్వు ఎరుగుదువా?"

"ఆ అమ్మ మామూలుగా ఎవ్వరికీ కనుపించదు. కాని నాదగ్గర ద్రాక్షకాయలు కొంటూ వుంటుంది. అందుకని నాకు తెలుసు. అసలు ఎందుకు అడుగుతున్నారు?"

ఆ క్రొత్తమనిషి, వాంగ్‌ఎర్ చూడకుండా జేబులో నుంచి ఒక రూపాయితీసి, కుర్రవాడి చేతిలో పెట్టాడు—"నీకే" అన్నాడు. ఒక చిన్న పొట్లాకట్ యిచ్చి, ఇది ఆమెకు ఇవ్వు. ఏ పరిస్థితుల్లోనూ ఆమె భర్తకు యివ్వకు. తెలిసిందా?" అన్నాడు.

"తెలిసింది. నేనీ వస్తువును ఆ ఉద్యోగి భార్యకు యివ్వాలిగాని ఉద్యోగికి యివ్వగూడదు."

"అదీ. పోయిరా. నువ్వు యిది యిచ్చింతర్వాత ఆమె నీతో వచ్చిందా సరేసరి. లేకపోతే ఆమె యేమి అంటుందో ఆ మాటలను వచ్చి నాతో చెప్పు" అన్నాడు.

కుర్రవాడు ఆ ఇంటిదగ్గరకు వెళ్ళాడు. సింహద్వారంలో నుంచి ఇంట్లోకి తొంగి చూసేటప్పటికి కనబడటం కనపడటం ఆ ఉద్యోగే కనుపించాడు. పైగా అతడు కుర్రవాణ్నే చూస్తూన్నాడు. "అక్కడేం చేస్తున్నావు?" అని అరిచాడు. ఆ అరుపుకి కుర్రవాడు భయపడి పరుగెత్తటానికి ప్రయత్నించాడుహువాంగ్‌ఫూ కుర్రవాణ్ని పట్టుకొని ఊపుతూ, "ఎందుకట్లా పారిపోతున్నావ్?" అని అడిగాడు.

"ఒక పెద్దమనిషి యీ వస్తువుని తమరి భార్య కియ్యమన్నాడు. తమరికి ఏమైనాసరే ఇయ్యవద్దన్నాడు" అన్నాడు వొణికిపోయి.

"ఏమిటది?" హువాంగ్‌ఫూ తీసుకోటానికి చెయ్యి జాపాడు.

"ఆ పెద్దమనిషి తమకు ఇయ్యవద్దన్నాడు" అన్నాడు కుర్రవాడు.

"ఇవ్వు!" అని చేతిలోని ప్యాకెట్ గుంజుకున్నాడు హువాంగ్‌ఫూ.

"అవి తమరికికాదు, తమ భార్యకి."

హువాంగ్‌ఫూ ఆప్యాకెట్ విప్పిచూశాడు అందులో వొక బంగారపు గొలుసు వున్నది. రెండు బంగారపు పమిటపిన్నులు వున్నవి. వీటికితోడు ఒక వుత్తరం వున్నది. ఆ ఉత్తరం గబగబా తీసి చదివాడు అందులో యిట్లా వున్నది.

"ప్రియమైన హువాంగ్‌ఫూ భార్యకు!

ఇది మీకు సాహసకృత్యంగా తోచవచ్చు. కాని నేను మిమ్మల్ని ఆ హోటల్లో చూచినప్పటినుంచీ మరువ లేకుండా ఉన్నాను. నేను మీ

దగ్గరకువచ్చి పరిచయం చేసుకుందాం అనుకున్నాగాని, ఇంతలోకి మీ భర్తరూపంలో వున్న ఆ గాడిద వచ్చాడు. మిమ్మల్ని ఒంటరిగా చూడాలని నేను కోరవచ్చా? ఈ చీటీ తెచ్చే కుర్రవానితో కలిసి రావలసింది. లేక పోతే ఎక్కడ కలవమంటారో తెలియజెయ్యవలసింది ఇందులో కొన్ని వస్తువులను మీ ఎడల నాకున్న గౌరవాభిమానాల చిహ్నంగా పంపుకుంటున్నాను.

ఇట్లు.
మీ అభిమాని''

యిది చదివి ఆ ఉద్యోగి పళ్ళు పటపట కొరికాడు. కనుబొమ్మలు పైకెత్తి ''ఇది పంపింది ఎవ్వరు?'' అని అడిగాడు.

ఈ మాటకు సెంగ్‌ఎర్, వాంగ్‌ఎర్ టీ అంగడివేపు చూపి, ''దట్టమైన కనుబొమ్మలు కలిగి, పెద్దకన్నులు కలిగి, బుర్రముక్కు కలిగి, పెద్దనోరు కలిగివున్న ఒక పెద్దమనిషి అక్కడ నాకిచ్చాడు'' అన్నాడు.

హువాంగ్‌ఫూకి కోపంతో వొళ్ళూపై తెలియలేదు. ఆ కుర్రవాణ్ణి రెక్కపట్టుకొని టీ అంగడి దగ్గరకు లాక్కొని వెళ్ళాడు. కాని అక్కడ ఆ ఉత్తరం యిచ్చిన కొత్తమనిషిలేడు. వాంగ్‌ఎర్ వద్దని చెపుతున్నా వినకుండా, హువాంగ్‌ఫూ ఆ కుర్రవాడ్ని మళ్ళీ తన ఇంటికి ఈడ్చుకునివెళ్ళి గదిలోపెట్టి బంధించాడు. ఆ కుర్రవాడు భీతికుడిచిపోయాడు.

హువాంగ్‌ఫూ కోపంతో వొణికిపోతూ, భార్యను పిలిచాడు. ఆ ఉత్తరం చూపాడు. ఆ వస్తువులు చూపాడు—''ఏమంటావ్?'' అన్నాడు.

ఆమె సుకుమారమైనది. చక్కనిది. తీరిగ్గా కుర్చీలో కూర్చొని వస్తువులను రెప్పవెయ్యకుండా చూడటం మొదలు పెట్టింది.

''ముందు ఆ వుత్తరం చదువు'' అన్నాడు ఆమె భర్త.

ఆమె చదివింది నెమ్మదిగా తల అడ్డంగా తిప్పుతూ ''ఇది నాకై

వుంటాడు, ఎక్కడో పొరపాటు జరిగింది'' అన్నది. ''ఎవరు పంపారు?'' అని అడిగింది.

''ఆ సంగతి నాకెట్లా తెలుస్తుంది? నీకు తెలియాలి. నేను పనిమీద వెళ్ళిన ఈ మూడునెలలూ నువ్వు ఎవ్వరితో కాలం గడుపుతున్నావ్?'' గద్దించి అడిగాడు భర్త.

''నా సంగతి మీకు బాగా తెలుసు'' అన్నది భార్య. ''నేను అటువంటిదాన్నా? మనకు వివాహం అయి యేడేళ్ళయింది, భార్యలు చెయ్యగూడనివని నేనింతవరకు యేదైనా చేశానా?''

''అయితే ఈ వుత్తరం ఎక్కడినుంచి పుట్టింది అంటావ్''

''నాకెట్లా తెలుస్తుంది.?''

ఆ వుత్తరం ఎల్లాపుట్టిందో చెప్పలేక, తన నిర్దోషిత్వం నిరూపించుకోలేక ఆమె ఏడ్వటం మొదలు పెట్టింది. ''ఎంత దురదృష్టం వచ్చి పడింది! నెత్తిన పిడుగుపడినట్లుపడింది!'' అని రోదించింది. అకస్మాత్తుగా ఆమె భర్త చెంపమీద ఛెళ్ళున ఒక దెబ్బవేసేడు. ఆమె బిగ్గరగా ఏడుస్తూ ఇంట్లోకి పరుగెత్తింది.

ఆ వుద్యోగి వెంటనే నౌకరి దాన్ని పిలిచాడు. ఒంకె నుంచి ఒక కర్రతీశాడు. ఆమె చేతులను తాడుతో కట్టివేసి దూలానికి వేలాడ దీశాడు. కర్రతీసుకొని, ''నేను లేనప్పుడు నీ యజమానురాలి దగ్గరకు ఎవ్వరు వచ్చేవారో చెప్పు.'' అని బాదటం మొదలు పెట్టాడు.

''ఎవ్వరూ లేరు, ఎవ్వరూ లేరు.'' అని అది యెంత మొర పెట్టుకున్నా అతను వినలేదు....

''చెప్పు చెప్పు'' అని కొట్టాడు.

అది దెబ్బలు భరించలేక చివరికి, ''అమ్మ మీరు లేనప్పుడు నౌకరితో కలిసి పడుకునేది,'' అని చెప్పింది.

"అట్లా దారికిరా," అన్నాడు హువాంగుపూ. ఆమెను ఊదదీసి, "యెవ్వరో ఇప్పుడు చెప్పు" అన్నాడు.

అది కళ్ళు తుడుచుకుంది. ఏహ్యాభావం కంఠంతో తొణికిసలాడగా, "ప్రతిరాత్రీ అమ్మనాతో కలిసి పడుకునేది." అని చెప్పింది.

ఈ మాటకు వుద్యోగి కళ్ళు తిరిగినై.... "దీని అంతు కనుక్కోక పోతేచూడు." అని తలుపుతాళం వేసి ఊళ్ళోకి వెళ్ళాడు....

అతని భార్య, నౌకరు నౌకరినౌకరు చూసుకున్నారు. నౌకరు దాని దెబ్బలకు ఆమె కాపువేసింది. కాపు వేస్తూ "పరమ పశువు" అనుకున్నది.

నౌకరు ఏక్కెక్కి ఏడుస్తూ, "మీకోసం కాకపోతే నా దారిని నేను పోయేదాన్ని" అన్నది.

"ఊరుకో అలా అనకు."

"ఆమె ఒకమూల నక్కి కూర్చున్న కుర్రవాణ్ణి చూచింది. "ఆయన యెలా వుంటాడు?" అని అడిగింది, వుత్తరం ఇచ్చినాయన్ని గురించి.

కుర్రవాడు చెప్పాడు. ఆమే ఆ నౌకర్దీ చెవులురిక్కించు కొని విన్నారు. "దట్టమైన కనుబొమ్మలూ...."

ఒక అరగంట దాటింతర్వాత హువాంగు పూ కోర్టు ఆఫీసర్లని ముగ్గుర్ని వెంటబెట్టుకొని ఇంటికివచ్చాడు. కుర్రవాణ్ని బయటకులాగి, "పీడిపేరు రాసుకోండి." అన్నాడు. ఆఫీసర్లు అలాగే కుర్రవానిపేరు వ్రాసుకున్నారు. అప్పుడే వెళ్ళకండి ఇంకా వున్నారు." అని చెప్పి ఆయన లోపలనుంచి తన భార్యను పిలిచాడు. నౌకరి దాన్ని పిలిచాడు.... మొత్తం ముగ్గుర్నీ అరెస్టు చెయ్యమన్నాడు.

"మేము ఆమెను యెలా అరెస్టు చెయ్యగలం?" అన్నారు ఆఫీసర్లు....

"చెయ్యాలి." అన్నాడు హువాంగుపూ. "ఒక హత్య ఇందులో ఇమిడివుంది."

హత్య అనేటప్పటికి ఆఫీసర్లు హడలిపోయారు. ముగ్గుర్నీ 'అరెస్టు' చేశారు. ఈ హడావిడికి ఇరుగుపొరుగు వారంతా పోగయ్యారు.

"నేను ఇటువంటిరోజు చూస్తానని అనుకోలేదు. మీ తెలివితేటలను వుపయోగించి అసలా వుత్తరం వ్రాసిందెవ్వరో తెలుసుకోవలసింది. ఎంత అవమానం!"" అన్నది హువాంగ్ పూ భార్య కుములుతూ.

"అవమానానికి వెరిచేదాన్నైతే, అసలు నీవు ఇటువంటి పనికే పూనుకోకుండా వుండవలసింది." అన్నాడు హువాంగ్‌పూ.

"ఇరుగు పొరుగువారిని అడిగి చూడండి. మీరు లేనప్పుడు ఎవ్వరైనా మన గడప తొక్కారేమో...."

"అడుగుతా తొందరపడకు."

* * *

ముద్దాయిలతోపాటు హువాంగ్ పూ కూడా నేరారోపణ నిమిత్తం మేజిస్ట్రేటు కచ్చేరీకి వెళ్ళాడు. ఆ మేజిస్ట్రేటు పేరు చీన్‌చీన్ గుంగ్. అతని ఊరిన మొహంతో, అతి నిగ్రహంతో దేనికీ - తొణకనిమనిషి. భర్త అయిన హువాంగ్ పూ నగలూ ఉత్తరం చూపించి నేరారోపణ చేశాడు. మేజిస్ట్రేటు పరిశోధన పూర్తయ్యేలోగా ముద్దాయిలను డిటెన్షన్‌లో ఉంచాడు. ఖైదీలను ప్రశ్నించటానికి షాన్‌టింగ్, షాన్ చీన్ సింగ్ అనే ఇద్దరు జైలు ఆఫీసర్లను నియమించాడు. వారు హువాంగు పూ భార్యతో సంభాషణ ప్రారంభించారు. ఆమె తన సంగతి ఇలా చెప్పింది.

ఆమె పట్టణానికి దగ్గర్లోవున్న వొక పల్లెటూరులో పుట్టింది. చిన్నప్పుడే తల్లిని కోల్పోయింది. తన పది హేడవ సంవత్సరంలో తండ్రిని కోల్పోయింది. తనకు దగ్గర చుట్టాలెవ్వరూలేరు. మరు సంవత్సరమే వివాహం చేసుకొని యేడు సంవత్సరాలు హాయిగా కుటుంబ జీవితం అనుభవించింది. ఆమె భర్త లేనప్పుడు బంధువులుగానీ, మరెవ్వరుగానీ ఇంటికి వచ్చేవారుకాదు. హోటల్లోగానీ, ఇంట్లోగాని ఆమె తన భర్తతో

తప్ప మరెవ్వరితోనూ ఆమె కలసి భోజనంచేసి ఎరగదు. ఆ ఆకాశ రామన్న ఉత్తరం ఎవ్వరు పంపిందీ ఆమెకు తెలియదు.

దానిమీద ఆఫీసర్లు ఆమెను ఈ విధంగా ప్రశ్నించారు. "స్త్రీ బంధువులు నీ యింటికి ఎందుకు రారు?"

"వారు రావటం నా భర్తకు ఇష్టంలేదు. ఒకసారి ఛాంగ్ఎర్ అనే బంధువు ఉద్యోగంకోసం మా యింటికి వచ్చాడు. వుద్యోగం దొరకటం కష్టం గనుక అతనికి వుద్యోగం దొరకలేదు. అప్పటినుంచీ నా భర్త నా బంధువులతో సంబంధం పెట్టుకోవద్దన్నాడు.... నేను పెట్టుకోలేదు."

"నువ్వు నీ భర్త ఎట్లా చెబితే అట్లా చేస్తావన్న మాట?"

"అవును అంతే."

"నువ్వెప్పుడయినా నాటకాలు చూట్టానికి వెళ్తావా?"

"లేదు."

"ఎందుకని?"

"వారు నన్ను తీసుకువెళ్ళరు."

"నువ్వు వొంటరిగా వెళ్ళవన్నమాట."

"వెళ్ళను...."

"నువ్వెప్పుడయినా భోజనానికి హోటలుకి వెళ్తావా?"

"ఎప్పుడో ఒకసారి. నాకు యింటిదగ్గరే బాగుంటుంది. ఒకరోజు ఆయన రాజ ప్రసాదంనుంచి వచ్చి యింటిదగ్గర భోజనం బాగులేదని హోటలుకి తీసుకువెళ్ళారు...."

"అక్కడ ఇద్దరూ కలిసి భోజనం చేశారా?"

"అవును."

ఈ విధంగా నడిచినై ప్రశ్నలూ, జవాబులూ. తరువాత యిరుగు పొరుగువారూ, చివ్వరికి నౌకరిదీ ప్రశ్నించబడ్డారు. అంతా అయింతర్వాత రిపోర్టు మేజిస్ట్రేట్ కి అందచెయ్యబడింది.

మరునాడు విచారణ ప్రారంభం అయింది. మేజిస్ట్రేట్ మొదట్లో కుర్రవాణ్ని ప్రశ్నించాడు. తరువాత నౌకరు దాన్ని ప్రశ్నించాడు. దాన్ని భయపెట్టాలని బల్ల గుద్ది కఠినస్వరంతో దబాయించాడు. "ఇంటిలో జరిగే దంతా నీకు తెలుసు కాదూ?"

"తెలుసు."

"మీ యజమాని ఇంటిలో లేనప్పుడు ఒక వ్యక్తిగానీ, లేక ఒకరి కంటె ఎక్కువ వ్యక్తులు గానీ వచ్చిపోతూవుండటం గానీ లేక రావడం గానీ నీవు గమనించావా?"

"ఎవ్వరన్నా వస్తే నాకు తెలవకుండా ఎట్లా వుంటుంది?"

ఈ జవాబు మేజిస్ట్రేట్ కి కోపం వచ్చింది. గట్టిగా బల్లగుద్దాడు. "నువ్వు అబద్ధాలకోరువి.... నువ్వు నాముందే అబద్ధాలు చెపుతున్నావు. నిన్ను జైలుకి పంపిస్తాను"అని గద్దించాడు.

నౌకరిదానికి భయంవేసింది. భయం వేసి మరీ గట్టిగా చెప్పింది. "ఘనమైన అయ్యా, నేను అబద్ధం ఆడలేదు. నా యజమానురాలు యెప్పుడూ ఇంటిలోనే వుంది. ఆమెకోసం ఒక వ్యక్తిగానీ, ఒకరిని మించిన వ్యక్తులుగానీరాలేదు. మంచి మనిషికి మీరు అపకారం చెయ్యకూడదు," అని తెంచుకొని చెప్పి బిగ్గరగా యేడ్వటం మొదలు పెట్టింది.

దాన్తో అది చెప్పింది నిజమే అని మేజిస్ట్రేట్ కి నమ్మకం కలిగింది. భర్తతో "సాక్ష్యం లేదు. సాక్ష్యం లేకుండా నేను ఎవ్వర్నీ దండించను" అని చెప్పాడు. మీకు అభిప్రాయ బేదాలు కలిగించాలని ఎవ్వరో ప్రయత్నిస్తున్నారు. అవేవీ నమ్మకుండా సుఖంగానే కాపురం చెయ్యటం మంచిది" అన్నారు.

కాని హువాంగుపూ ఆయన మాటలు వినలేదు. "ఘనమయిన అయ్యా! ఈ పరిస్థితుల్లో నేను ఆమెను సనేమీ తీసుకు వెళ్ళను" అన్నాడు.

"నువ్వు పొరపాటు చేస్తున్నావ్!" అన్నాడు మేజిస్ట్రేట్.

"ఏదన్నా కానివ్వండి....నాకు విడాకు లిప్పించండి." అన్నాడు భర్త. అని భార్యవంక క్రీగంట చూపులు ప్రసరించాడు.

ఇంకా కొంత విచారణ జరిగిం తర్వాత మేజిస్ట్రేట్ "నీ భర్త విడాకులు కావాలని పట్టుబడుతున్నాడు. నువ్వే మంటావు?" అని అడిగాడు భార్యని.

"నే నే పాపం ఎరుగను. ఆయనకు విడాకులు కావలిస్తే అలాగే కానివ్వండి" అన్నది భార్య....

భర్త కోరిన ప్రకారం విడాకు లివ్వబడింది. కుర్రవాడూ నౌకరిదీ విడిచిపెట్టబడ్డారు. భార్య పూర్తిగా క్రుంగిపోయింది. సంఘంలో విడాకులు స్త్రీకి చాలా అవమానం. "ఏడేళ్ళ కుటుంబ జీవితం తర్వాత మీరింత ఘోరం చేస్తారని నే నెప్పుడూ అనుకోలేదు. నాకీ ప్రపంచంలో మీరుతప్ప ఎవ్వరూ లేరని మీకు తెలుసు. ఈ విధంగా అవమానంతో బ్రతకటంకంటే నాకు మరణమే మేలు." అన్నది.

"నాకేం తెలుసు?" అన్నాడు హువాంగుపూ పెడమొహం పెట్టి "అందులో నా ప్రమేయం ఏమీ లేదు."

ఆమెకు ఏమీ తోచలేదు. సరాసరి నదివొడ్డుకి వెళ్ళింది. నదిలోకి దూకబోయింది. ఎవ్వరో వెనక్కిలాగారు. వెనుతిరిగి చూసింది. ఒక ముదుసలి. అరవై ఏళ్ళు వుంటాయి. నల్లని చీరె కట్టుకొని వుంది. అప్పు డప్పుడే తల వెంట్రుకలు తెలుపుకి తిరుగుతున్నయ్.

"అమ్మాయ్, ఎందుకు జీవితంమీద ఇంత విరాళి?" అన్నది.

హువాంగుపూ భార్య ఆమెను తేరిపార చూసింది.

"నన్ను గుర్తుపట్టలేదా?" అన్నది ముదుసలి.

"లేదు."

"నేను నీ మేనత్తని....నిన్ను ఎప్పుడో చిన్నప్పుడు చూశాను. నువ్వేదో కోర్టు వ్యవహారంలో చిక్కుకున్నావని తెలిసి రోజూ కోర్టుకి వచ్చాను. కోర్టు విడాకు లిచ్చిందని నాకు తెలుసు. అయితే నదిలోకి దూకటం ఎందుకు?"

"నన్ను భర్త విడిచిపెట్టాడు. నాకు ఉండే చోటు లేదు. నేనెందుకు బ్రతకాలి?"

"రా, రా, నాతో వుందువుగాని," అన్నది ముదుసలి. "నువ్వేమీ నాకు పరాయిదానివి కాదుగదా!"

ఆమె పెద్ద ఇష్టం అయిష్టం లేకుండా ఆ ముదుసలి వెంట నడిచింది.

ఆ ముదుసలి ఇల్లు చిన్నదైనా అందంగా, పరిశుభ్రంగా వుంది. కుర్చీలూ, బెంచీలూ మొదలైన సామాను చక్కగా అమర్చబడి వుంది.

"అత్తా! ఈ ఇంటిలో నువ్వు ఒక్కదానివే వుంటావా?" అని అడిగింది.

"అవునమ్మా!....ఏదో కాలక్షేపం చేస్తున్నాను....అయితే నేను నిన్ను చిన్నప్పుడు "చిట్టీ" అని పిలిచేదాన్ని....పేరు జ్ఞాపకంలేదు....."

"నా పేరు చున్నీ."

"నా పేరు మాత్రం నీకేం జ్ఞాపకం వుంటుంది! నన్ను 'హూ' అని పిలుస్తారు" అన్నది ముదుసలి.

అలా కొన్నిరోజులు గడిచినై. హూ, చున్నీని. చాలా ప్రేమగా చూసేది. ఒకరోజు వారిద్దరూ భోజనంచేసి పడుకున్న తర్వాత ఎవ్వరో తలుపు తట్టారు. హూ తొందరగా లేచివెళ్ళి తలుపు తీసింది.

"అప్పుడే తలుపులు వేసుకున్నావే" అన్నది మొగగొంతు. ఇద్దరూ హాల్లోకి వచ్చారు. హూ అతన్ని కూర్చోమని మర్యాద చేసింది.

కాని అతను "పనివుంది. త్వరగా వెళ్ళాలి." అని చెప్పి కూర్చోలేదు. చుస్మీ అతన్ని తన గది దగ్గరనుంచి చూచింది. ఒత్తుగా పెరిగిన కనుబొమ్మలూ, పెద్దకళ్ళూ, పెద్దనోరూ, కొనితేలివుండని ముక్కూ—ఆమెకు అకస్మాత్తుగా తనకోసం ప్యాకెట్ తెచ్చిన కుర్రవాడు వర్ణించిన వర్ణన జ్ఞాపకం వచ్చింది. ఊపిరిబిగబట్టి కూచుంది.

"ఇంకా ఎన్నాళ్ళు? నువ్వా వస్తువులు అమ్మి ఇప్పటికి నెలదాటిపోయింది. నాకా డబ్బుకావాలి" అన్నాడు అతను.

"నేనుమాత్రం యేం చెయ్యను? నేను అమ్మినవాళ్ళు నా కివ్వాలిగదా!" అన్నది హూ.

"కాని రోజులు గడిచిపోతున్నై. త్వరగా వసూలు చెయ్యి"అన్నాడు. అతను వెళ్ళిపోయాడు. హూ కొంచెం కంగారు పడుతున్నట్లు కనిపించింది. ఆమె లోపలకు రాగానే "ఆయన ఎవ్వరు?" అని అడిగింది చుస్మీ.

"చెపుతా విను చుస్మీ. అతని పేరు హంగ్. ఏదో రిటైర్ అయిన మేజిస్ట్రేటునని చెపుతాడుగాని నేను నమ్మను. కాని మంచివాడు. నన్ను అప్పుడప్పుడు రవ్వలు అమ్మిపెట్టమని అడుగుతూ వుంటాడు. మొన్న అలాగే అమ్మిపెట్టమని కొన్ని యిచ్చాడు. నేను అమ్మాను. కాని నా దగ్గర కొన్నవాళ్ల ఇంకా డబ్బు యివ్వలేదు. దానికి నేనేం చెయ్యను?" అన్నది.

"ఆయన్ని నువ్వు బాగా ఎరుగుదువా?"

"ఆఁ ఎరుగుదును. మంచివాడు. అవసరం అనుకుంటే ఎంత డబ్బయినా ఖర్చుపెడతాడు. ఈసారి వచ్చినప్పుడు నీకు పరిచయం చేస్తానుండు" అన్నది హూ.

ఆమె లోలోపల సంతోషించుకుంది. అప్పటినుంచీ హ్యాంగ్ తరచు వచ్చి పోతుండేవాడు. ముదుసలి చుస్మీని తన చుట్టంగా అతనికి పరిచయం చేసింది. పరిచయం అయినప్పటి నుంచీ ఆకాశరామన్న ఉత్తరం పంపింది. ఆయనో, కాదో తెలుసుకోవాలనే కుతూహలం చుస్మీకి ఎక్కువైంది.

ఒకరోజు ఆయన్ని రెప్పవెయ్యకుండా చూస్తూ ఏదో ఆలోచించు కుంటూ కూచుంది చున్మీ.

"ఎందుకట్లా చూస్తావ్?" అని అడిగాడు హంగ్.

"ఊరికినే" అన్నది చున్మీ.

"నా ముఖంలో అదృష్టరేఖలున్నాయని ఏ శరీరశాస్త్రజ్ఞుణ్ణడిగినా చెపుతాడు" అన్నాడు హంగ్.

ఆమె నవ్వింది.

"ఎందుకు నవ్వుతున్నావు" అన్నాడు హంగు.

ఆమె చెప్పబోయింది. మళ్ళీ ఎందుకులే అని వూరుకుంది.

వారి పరిచయం దినదినాభివృద్ధి చెందింది. ఒకరోజు హు చున్మీని అడిగింది, "అతడిని గురించి నీ ఉద్దేశం ఏమిటి" అని.

"చిత్రమైన మనిషి" అన్నది చున్మీ.

"మొన్న నన్నొక పనిచేసి పెట్టమని అడిగాడు" అంది హు.

"ఏమిటది?"

"అతను ఒంటరిగా వుంటున్నాడు. పెళ్ళి చేసుకోటానికి మంచి పిల్లని ఎక్కడైనా చూచిపెట్టమన్నాడు. నువ్వంటే అతనికి అమితమైన యిష్టమని నా అనుమానం."

"అట్లనా?"

"అట్లనా ఏమిటి? నువ్వతన్ని వివాహం చేసుకుంటే బాగుంటుంది...."

చున్మీ కాసేపు ఆలోచించింది. "కాని నా కొక అనుమానం వుంది."

"ఏమిటది?"

"నా భర్తకు ఆ పాంఫ్లెట్ పంపి, మా యిద్దరికీ చెడగొట్టింది. ఈయనే నేమోనని నా అనుమానం" అన్నది.

ఈ మాటకు ఈమె బిగ్గరగా నవ్వింది.

"నిజం అత్తా! ఆ కుర్రవాడు వర్ణించిన వర్ణన అక్షరాలా ఈయనకు అతుకుతుంది" అన్నది చున్మీ.

"అలాగే అనుకో. అయితేమాత్రం నష్టం ఏముంది?" అని అడిగింది హు.

చున్మీ ఆలోచించింది. నష్టంలేదని తేల్చుకుంది.

*　*　*　*

చున్మీ, హంగు వివాహం చేసుకున్నారు. వివాహం కాగనే చున్మీని తనసొంత ఇంటికి తీసుకువెళ్ళాడు హంగు. జీవితంలో ఇంత మాధుర్యం వుందని చున్మీకి తెలియటం అదే మొదలు. వారిద్దరూ అన్నిచోట్లకీ కలిసి తిరిగారు. హంగు ఎంత డబ్బుబడితే అంతడబ్బు ఖర్చు పెడుతున్నాడు. ఒకరాత్రి చున్మీ అతన్ని అకస్మాత్తుగా అడిగింది—"ఆ ఆకాశరామన్న ఉత్తరం ఎందుకు పంపావు!" అని.

అతను కాసేపు ఆలోచించి, "అతను నిన్ను హింసించే వాడు కాదూ?" అని అడిగాడు.

"నీకెట్లా తెలుసు?"

"నాకు తెలుసు. మీరిద్దరూ కలిసి వెళ్తుంటే దంపతులు అనుకో టానికే ఏహ్యంగా వుండేది."

"మమ్మల్ని ఎప్పుడు చూశావ్?"

"ఒకసారి చూశాను. ఏదో ఒక నెపంతో నిన్ను పలకరించాలని దార్లు అడిగాను. అప్పుడు అతను నిన్ను క్రూరంగా చూచి తనవెంట

లాక్కువెళ్ళాడు. అప్పటినుంచీ నిన్ను అతని చెరనుంచి విడిపించాలను కున్నాను.''

''నేను అతనితో సుఖంగానే వుండేదాన్ని.''

''అవును. పంజరంలోవున్న పక్షి అనుభవించే సుఖం అది అన్నాడు. ''నా ఉత్తరాన్ని పంపటానికి రెండురోజులు ముందు అతను నిన్ను హోట లుకి తీసుకువచ్చాడు. జ్ఞాపకంవుందా? నేను అప్పుడు అక్కడే వున్నాను. నీకేది కావాలో కూడా అతడు నిన్నడగలేదు. అతను తెప్పించినవి నువ్వు తిన్నావు. అతన్ని చూస్తుంటే నాకు కంపరం వేసింది. ఇక వుండబట్టలేక నీకు ఉత్తరం రాశాను. ఉత్తరం మాత్రం అతని చేతుల్లో పడాలని వ్రాయ లేదు అలా జరిగింది. అదీమంచికే అనుకున్నా. రోజు హూని వెంటబెట్టు కొని కోర్టుకివచ్చా.... నీకు విడాకులు ఇవ్వటం పూర్తయినప్పుడు నొక్క నిట్టూర్పు విడిచా....''

''అయితే....'' ఏదో అడగబోయింది. చున్మీ.

''అవును. హూ నీ మేనత్తకాదు. నా కోర్కెమీద నిన్ననుసరించి, రక్షించి, సాకింది'' అన్నాడు హుంగు.

''ఎంతమోసగాడవు!'' అన్నదామె చిరునవ్వుతో.

''అట్లనా?'' అన్నాడు. అని ఆమెను గట్టిగా ముద్దుపెట్టుకున్నాడు.

క్రొత్తసంవత్సరం వొచ్చింది. ప్రతికొత్త సంవత్సరం మంచి జరుగగలందులకు భర్తతోకలిసి ప్రార్థనలు చెయ్యటానికి సియాంకోషికి వెళ్ళటం ఆమెకులవాటు. ఈ సంవత్సరం అక్కడకు హుంగుతో కలిసి వెళ్ళింది. ఆమె మొదటి భర్త హువాంగ్‌పూకూడా అక్కడికి వొచ్చాడు. అతను విడాకులకు కోర్టు డిగ్రీ ఇచ్చినప్పటినుంచీ ఏకాకిగావుండి శాంతి లేక బాధపడుతున్నాడు ఆకాశరామన్న ఉత్తరం పంపిన వ్యక్తి ఎవరో అతనికి యింకా తేలలేదు. ఇప్పుడు భార్యని, పోగొట్టుకొన్న తర్వాత, ఆమె మంచి గుణాలు వొక్కొక్కటే అతనికి జ్ఞాపకం రానారంభించినై. ఆమెను

గురించి ఆలోచిస్తున్నకొద్దీ ఆమె నిరపరాధి అని అతనికి అనిపించింది. అతనికి పశ్చాత్తాపం కలిగింది. దేవళానికి వొచ్చాడు.

ఆ దేవళం దగ్గర జనసమూహం యెక్కువ వుంది. ఆయన బయటికివస్తూ, తన పూర్వపు భార్య ఒక నూతనవ్యక్తితో కలిసి దేవళంలోకి వెళ్ళటం చూశాడు. వాళ్ళు అతన్ని చూడలేదు. వాళ్ళకోసం కనిపెట్టుకొని బయటేనుంచున్నాడు అతను. వాళ్ళు తిరిగి రావటంచూచి కోపంతో అసూయతో వాళ్ళకు కనబడకుండా జనం వెనక దాక్కొని నెమ్మదిగా వాళ్ళని అనుసరించాడు. గేటుదాకా వెళ్ళి ఆమెని పేరుపెట్టి పిలిచాడు. ఆమె వెనక్కు తిరిగి చూచింది.

"ఓ మీరా?" అంది చిరాకుగా.

"చున్మీ" నువ్విక్కడేం చేస్తున్నావ్? నాతో యింటికిరా" అన్నాడు. అని ఆమె ప్రక్కనవున్న హంగుని చూశాడు.

"నువ్వు ఎవ్వరివి?" అని అడిగాడు హంగు. "ఆవిడజోలికి వెళ్ళవద్దు" అన్నాడు. అని ఆమెవేపుకి తిరిగి, "ఇతడు నీకేమౌతాడు?" అని అడిగాడు.

"నా పూర్వపు భర్త"

'రా చున్మీ. నేను నిన్ను క్షమించాను. నేను ఒంటరితనాన్ని భరించలేకుండా వున్నాను. రా." చున్మీ అన్నాడాయన ప్రార్థనా పూర్వకంగా.

"ఇప్పుడతను నీ భర్తకాదుగదా?" అని అడిగాడు హంగు ఆమెని

"కాదు."

"నీతో కాసేపు మాట్లాడవచ్చా?" అని అడిగాడతను. హంగు ఆ మాటవిని కొంచెం దూరంగావెళ్ళి నుంచున్నాడు.

"నీ కేంకావాలి?" అని కోపంగా అడిగింది ఆమె తన పూర్వపు భర్తని.